మాజీ సీఎం యడియూరప్పకు 83 ఏళ్లు
● అభిమానుల మధ్య జన్మదిన వేడుకలు

7

అన్నదాత జీవితాల్లో మార్పు కోసమే ప్రత్యేక పథకాలు
● జాతీయ ఉద్యాన మేళాలో కేంద్ర మంత్రి శోభాకరంద్లాజే


బ్యాడగి మార్కెట్‌లో మిర్చి రాశులు

అంధకారం..!

● రాష్ట్రంలో మిర్చి రైతుకు కన్నీటి కష్టాలు ● 50 శాతం తగ్గిన ధరలు ● అందని ప్రోత్సాహకం ● దేశంలో 25శాతం సాగు రాష్ట్రంలోనే..

బెంగళూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మిర్చి రైతు బతుకు అంధకారంగా మారింది. లక్షల రూపాయలు అప్పు చేసిన పంట చేతికొచ్చే సరికి ధరలు పాతాళానికి పడిపోయాయి. కారం లేదంటే ముద్ద దిగదు... ఇది ప్రతి మనిషికి నిత్యం అవసరమైన కారం మిరపతోనే సాధ్యం. ఈ ఏడాది సంతృప్తికరంగా వర్షాలు కురిశాయని, పంట బాగా పండిందని సంబరపడిన మిర్చి రైతుకు ధరలు పడిపోవడంతో కన్నీటికష్టమే మిగిలింది. మిరపరైతు ఈ ఏడాది పంట పండాక చేతులు కాల్చుకున్నట్లయ్యింది. వర్షాలు కూడా ఎక్కువ కావడంతో పైర్లు, కాయలు కొంతమేర కుళ్లింది. ఇలా పంట దిగుబడి కొంతమేర మాత్రమే తగ్గినా ఆశాజనకంగానే పండింది. అయితే కేవలం గత ఏడాది ధరలతో పోల్చితే 35-50శాతం దాకా ధరలు కుశించుకుపోయాయి. ఇది కేవలం రాష్ట్రంలోని మిరపరైతుకే కాదు దేశంలోనే పేరొందిన గుంటూరు మిరపరైతుపైనా భారీ ప్రభావం చూపింది. రాష్ట్రంలో ధారవాడ, గదగ్, హావేరి, రాయచూరు, బళ్ళారి, కలబురగి జిల్లాల్లో ఎక్కువగా మిరపసాగు చేస్తారు. దేశంలో పండే మిరపలో 25శాతం కర్ణాటకలో సాగు అవుతుంది. ఇలా ప్రధానంగా పండే ఆరేడు జిల్లాలతోపాటు రాష్ట్రమంతటా 3.25 లక్షల ఎకరాలలో మిరప సాగు చేస్తారు. రాష్ట్రంలో మిరపధరలు తగ్గడంతో లక్షలాదిమంది రైతులు నష్టపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని మిరపకు శాస్త్రీయమైన ధర నిర్ణయించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మిరపరైతు విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. పొరుగున ఉండే ఆంధ్రప్రదేశ్‌లో మిరపరైతుల సమస్యపై ప్రభుత్వం స్పందించిందని కానీ రాష్ట్రంలో ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కనీసమైన చొరవ చూపడం లేదని రైతులు మండిపడుతున్నారు.


బళ్లారి జిల్లాలో రోడ్డుపైనే ఆరబోసిన మిర్చి పంట (ఫైల్)

అ జిల్లాల్లో సాగు అధికం...

మిరప రాష్ట్రమంతటా సాగుచేస్తున్నా ఆరేడు జిల్లాల్లో మాత్రమే పంటకు అనుకూలంగా ఉంది. ధారవాడ, గదగ్, హావేరి జిల్లాల్లో ప్రతి హెక్టారుకు 0.5-1.5 టన్నుల వరకు దిగుబడి సాధ్యం కానుంది. బళ్ళారి, రాయచూరు, కలబురగితోపాటు అనుబంధ జిల్లాల్లో 3.75-5 టన్నుల వరకు దిగుబడి అవుతోంది. మిరపసాగుకు ఎకరాకు కనీసం లక్ష రూపాయలకుపైగానే ఖర్చు చేయాల్సి ఉంటుందని. మిరపధరలు తగ్గేందుకు ప్రధానంగా మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం, గత ఏడాది పంట గోడౌన్‌లలో భారీగా నిల్వ ఉండడం, ఆంధ్రప్రదేశ్‌నుంచి మిరప వస్తుండడంతోపాటు మిరప కొనుగోళ్లకు మసాలా తయారీ కంపెనీలు ముందుకు రాకపోవడమే కారణంగా తెలుస్తోంది.

50 శాతం తగ్గిన ధరలు

హావేరి జిల్లా బ్యాడగి మార్కెట్‌లో ఈ ఏడాది దిగుమతి తగ్గింది. గత ఏడాదితో పోలిస్తే ధరలు 50శాతం తగ్గాయి. గత ఏడాది జనవరిలో బ్యాడగి కడ్డీ మిరపకాయ క్వింటాలుకు రూ.3వేలనుంచి గరిష్టంగా 61వేల దాకా ఉండేది. డబ్బీ మిరప రూ.3,100 నుంచి రూ.62వేల దాకా విక్రయం జరిగింది. గుంటూరు మిరప గత ఏడాది 1500 నుంచి 19,400 దాకా ఉంది. మంగళవారం హావేరి మార్కెట్‌లో బ్యాడగి కడ్డీ మిరప రూ.1600 నుంచి రూ.33,399గాను, డబ్బీ మిరప 2800 నుంచి 38వేల దాకాను, గుంటూరు మిరప కనిష్టంగా రూ.950 నుంచి గరిష్ఠంగా 16,400 దాకా ధర పలికింది. వీటి ప్రకారం గత ఏడాదితో పోలిస్తే 50శాతం మేర ధర తగ్గినట్టయ్యింది.

కనీస మద్దతు ధర కోసం కేంద్రానికి వినతి

● మంత్రి శివానంద పాటిల్



మార్కెట్‌లో ఏ వస్తువైనా ధరలలో వ్యత్యాసం సాధారణమని, ధర తగ్గిపోయేందుకు పలు కారణాలు ఉన్నాయని వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ మంత్రి శివానంద పాటిల్ అభిప్రాయపడ్డారు. మిరప ధర తగ్గడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. కేంద్రప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తామన్నారు. కేంద్రప్రభుత్వం అనుమతులు ఇస్తే కొనుగోలు కేంద్రాల ద్వారా కనీస మద్దతుధరతో మిరప కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.



పార్సిళ్లకు ప్లాస్టిక్ వద్దు..!

● ఇడ్లీ తయారీలోనూ గుడ్డలు మాత్రమే వాడాలి
● ప్లాస్టిక్‌తో క్యాన్సర్ ప్రేరేపించే రసాయనాలు
● ఉల్లంఘిస్తే కఠినచర్యలు... హోటళ్లు నిబంధనలు పాటించాలి
● వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దినేష్‌గుండూరావ్ ఆదేశాలు

బెంగళూరు, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): ఎటువంటి కలుషితం లేకుండా ఆవిరితో తయారయ్యే ఇడ్లీ ఆరోగ్యానికి ఎంతో మేలని అందరూ భావిస్తారు. కానీ ఇటీవల ఇడ్లీ ద్వారా క్యాన్సర్ ప్రభావం పెరుగుతోందనే అంశం బహిరంగం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇడ్లీ పార్సిళ్లకు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించారు. ఇడ్లీ పార్శిళ్ళకు ఎటువంటి ప్లాస్టిక్ పేపర్‌లను వాడరాదని రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దినేష్‌గుండూరావ్ వెల్లడించారు. గురువారం బెంగళూరులో మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఇకపై ఇడ్లీలను గుడ్డలు ఉపయోగించి మాత్రమే తయారు చేయాలని సూచించారు. వేడి ఇడ్లీని ప్లాస్టిక్ పేపర్ ద్వారా పార్శిల్ చేయడం ద్వారా క్యాన్సర్‌ను ప్రేరేపించే రసాయనాలు ఉన్నాయని తేలిందన్నారు. ఇటీవల నగర వ్యాప్తంగా బెంగళూరు మహానగర పాలికె ఆహార సంరక్షణా విభాగం అధికారులు దాడులు జరిపారు. 500 ఇడ్లీలను సేకరించగా వీటిలో 35 ఇడ్లీలు అత్యంత ప్రమాదకరమని నిర్ధారించారన్నారు. ప్లాస్టిక్ పేపర్ ఉపయోగించి ఇడ్లీ తయారు చేసినా, వేడి ఇడ్లీ పార్శిల్ చేసినా ప్రమాదకరమనే అంశాన్ని శాస్త్రవేత్తలు వివరించిన మేరకు వైద్య ఆరోగ్యశాఖ తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడాలని స్పష్టం చేశారు. ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా ఇడ్లీల తయారీలో కానీ పార్శిల్‌కు కానీ ప్లాస్టిక్ పేపర్‌లు వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

మహాదాయి జలవివాదం...

● ట్రిబ్యునల్ గడువు ఆరునెలలు పొడిగింపు

బెంగళూరు, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): మహాదాయి జలవివాదానికి సంబంధించి మరింత ఎక్కువ సమాచారం సేకరించాల్సి ఉండటంతో పాటు గోవా, మహారాష్ట్రాల అభ్యంతరం నేపథ్యంలో ట్రిబ్యునల్ గడువు మరో ఆరునెలల గడువు పెంచారు. ధారవాడ సమీపంలోని పశ్చిమకనుమలలో పుట్టే మహాదాయి నది వివిధ జిల్లాల మీదుగా గోవా, మహారాష్ట్రలకు చేరి సముద్రంలో విలీనమవుతుంది. మహాదాయి నదికి అనుబంధంగా కళాసా బండూరి కాలువలను కలుపడం ద్వారా ధారవాడతో పాటు వివిధ జిల్లాలకు తాగునీరు సమకూర్చుకునేందుకు కర్ణాటక ప్రభుత్వం కొన్నేళ్ళుగా పోరాటం చేస్తోంది. గోవా రాష్ట్రానికి సంపూర్ణంగా ఇదే జీవనాధారం కావడంతో కర్ణాటకలో ఎటువంటి నిర్మాణాలకు వారు అంగీకరించడం లేదు సమస్య పరిష్కారం కోసం గడువు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు.


పెరఫెక్ట్ ఉత్పత్తులను పరిశీలిస్తున్న రైతులు

ఉద్యాన ప్రదర్శనలో ఆకట్టుకుంటున్న

పెరఫెక్ట్ స్టాల్

బెంగళూరు, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉద్యాన పరిశోధనా కేంద్రం హెసరఘట్టలో జాతీయ ఉద్యాన మేళాలో భాగంగాఏర్పాటు చేసిన ప్రదర్శనలలో పెరఫెక్ట్ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెరఫెక్ట్ ఉత్పత్తుల పట్ల రైతులు ఆసక్తి చూపారు. పెరఫెక్ట్ సంస్థ దశాబ్దాల కాలంగా అన్ని సీజన్‌లలోను పైర్లు ఆరోగ్యకరంగా ఎదిగేందుకు అవసరమైన పోషక విలువలు అందించే ఉత్పత్తులను తయారు చేస్తోంది. సంస్థకు దేశవ్యాప్తంగా ఆదరణ ఉంది. వ్యవసాయానికి సంబంధించిన ప్రతి ప్రదర్శనలోను పెరఫెక్ట్ సంస్థ స్టాల్ ద్వారా రైతుల సందేహాలను నివృత్తి చేస్తుంది. అనుభవజ్ఞులైన సిబ్బంది తొలిరోజు స్టాల్‌ను సందర్శించి ఎంతోమంది రైతులకు ఉత్పత్తుల వివరాలతో ఆకట్టుకున్నారు.


పుస్తకమేళాను ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య, స్పీకర్ యూటీ ఖాదర్ తదితరులు

7

సాహిత్య సంబరాన్ని సద్వినియోగం చేసుకోండి: సీఎం


భువనేశ్వరీ మాతకు కళాకారుల స్వాగతం



రారండోయ్.. వేడుక చూద్దాం..!

● నేటి నుంచి హంపి ఉత్సవాలు ● బసవేశ్వర వేదికపై ప్రారంభించనున్న సీఎం సిద్దరామయ్య

బళ్లారి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక క్షేత్రం, శ్రీకృష్ణదేవరాయల అస్థానమైన హంపి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభం కానున్నాయి. మార్చి 3 వరకు జరగనున్న ఉత్సవాలను సీఎం సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంత్రులు ప్రారంభించనున్నారు. విరూపాక్షేశ్వర ఆలయం ఎదురుగా ఉన్నా ఎదురు బసవేశ్వర వేదికలో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు సుమారు 15లక్షల మంది సందర్శకులు హాజరయ్యే అవకాశం ఉందని జిల్లా యంత్రాంగం అంచనా వేసి పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఎంపీ ప్రకాశ్ వేదిక, ఎదురుబసవన్న వేదిక, కడ్లిబసవన్న వేదిక, మొత్తం మూడు వేదికలలో ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, గానకచేరి, వివిధ వేషదారణాల్లో కళాకారులుపాల్గొననున్నారు.


కేరళ సంప్రదాయ నృత్యం..

భువనేశ్వరీ మాతకు ఘన స్వాగతం


హంపి ఉత్సవాలకు భువనేశ్వరీ మాతను సాదరంగా ఆహ్వానించారు. హోస్పేట నగరంలోని వడకారాయణ ఆలయ సమీపంలో గురువారం గజరాజుపై విచ్చేసిన అమ్మవారికి ఎమ్మెల్యే గవియప్ప, జిల్లా అధికారులు స్వాగతం పలికారు.


6

చిన్నారులకు ప్రత్యేక పాఠశాల హర్షణీయం

● కేంబ్రిడ్జి మాంటిస్సోరి స్కూల్ ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ నాయకుడు వీకే వసంత్

బెంగళూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): గంగానగర్ ప్రాంతంలో చిన్నారులు ఆహ్లాదకర వాతావరణంలో చదువుకునేలా కేంబ్రిడ్జి మాంటిస్సోరి పాఠశాల ఏర్పాటు చేయడం సంతోషకరమని కాంగ్రెస్ నాయకుడు వీకే వసంత్ అభిప్రాయపడ్డారు. ప్రాస్పర్ ఓఎస్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ఆధ్వర్యంలో గురువారం పాఠశాలను లాంఛనంగా ఆవిష్కరించారు. సంస్థ అధ్యక్షులు ఎస్. మొహసినా, వైస్ ప్రెసిడెంట్ పీఎండీ షబ్బీర్, పీఎండీ హారూన్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఇదే సందర్భంగా వసంత్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రతిచోటా ఏర్పాటవు తున్నాయని కానీ చిన్నారులలో ఆలోచనాశక్తి, ఆహ్లాదకర వాతవారణంలో చదువునేర్పేలా ఉండాలన్నారు. అధ్యక్షులు మొహసినా మాట్లాడుతూ చిన్నారుల కోసమే ప్రత్యేకంగా ఉండాలని పాఠశాలకు శ్రీకారం చుట్టామన్నారు. లిటిల్‌హార్ట్, టెండర్ హార్ట్, నర్సరీ, యూకేజీ, డేకేర్‌లను నిర్వహిస్తామన్నారు. వచ్చే ఏడాది కోసం అడ్మిషన్‌లు ప్రారంభించినట్లు తెలిపారు. పాఠశాలలో పనిచేసిన అనుభవంతోనే కేంబ్రిడ్జ్ మాంటిస్సోరి సంస్థను శ్రీకారం చుట్టామన్నారు.


కేంబ్రిడ్జి మాంటిస్సోరి పాఠశాలను ప్రారంభిస్తున్న వసంత్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1608.34	1,587.14
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,104	763
నీటి నిల్వ (టీఎంసీలు)	34.42	8.80



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు, పశువైద్యులు

గొర్రెల మందపై చిరుత దాడి

కంప్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని అంగూర గ్రామంలో గొర్రెలపై చిరుత దాడి చేయడంతో ఐదు జీవాలు మృతి చెందాయి. అంగూర గ్రామానికి చెందిన శివన్నగౌడకు చెందిన గొర్రెలు పొలంలో వుండగా వారు ఇంటికి వెళ్లిన సమయంలో చిరుత దాడి చేసింది. ఈ దాడిలో ఐదు గొర్రెలు మృతి చెందగా మరికొన్ని గాయపడ్డాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు, పశువైద్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్రమత్తంగా వుండాలని ఒంటరిగా తిరగరాదని, వెలుతురు వుండేలా చూసుకోవాలని అధికారులు రైతులకు సూచించారు.

రథోత్సవానికి ఏర్పాట్లు



రథాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

కంప్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మార్చి 14న జరుగనున్న దొడ్డ బసవేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా తేరును ముస్తాబు చేయడానికి ఆలయ కమిటీ గోడౌన్‌లో వున్న రథాన్ని బయటకు తీశారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖాధికారి హనుమంతప్ప మాట్లాడుతూ ఇప్పటికే రథోత్సవం పనులు ప్రారంభమయ్యాయి. ప్రతి యేటా రథోత్సవంకు ముందుగా వచ్చే శివరాత్రి రోజునే పూజలు చేపట్టి గోదాములోని రథాన్ని బయటకు తీస్తామని తెలిపారు. కురుగోడుతో పాటు ముష్టిగట్టి, కలకంబ్ల, కెరికేరి, సోమలాపురం, బాదనట్టి, వడ్డట్టి గ్రామాల భక్తాదులు పాల్గొన్నారు.

రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ

కంప్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బీజేపీ మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప పుట్టినరోజు సందర్భంగా తాలుకా బీజేపీ అధ్యక్షుడు మహదేవ ఆధ్వర్యంలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమనాయకులు బీజేపీకి అండగా వుంటూ రానున్న ఎన్నికల్లో విజయ పతాకం ఎగురవేసేందుకు అనుకూలించేలా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాధర, రమేష్, ఆంజనేయులు, వీఎల్ బాబు, చంద్రశేఖర్‌గౌడ, శ్రీనివాస్, గోపాల్, గురురాజు, సుదర్శన్ రెడ్డి, చెన్నప్ప, ప్రసాద్, సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

మూడు రోజుల్లోగా ముగించాలి..

రాయచూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అత్యధిక స్థాయిలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసే దీన్ దయాళ్ జన ఆజీవిక పథకానికి సంబంధించి మూడు రోజుల్లోగా ప్రణాళికను సిద్ధం చేయాలని రాయచూరు కమిషనర్ జుబిన్ మూహపాత్ర ఆదేశించారు. గురువారం నగరంలోని పాత జిల్లాధికారి కార్యాలయ భవనంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఉద్యోగ అవకాశాల సృష్టికి సంబంధించి రాయచూరు, తుమకూర్, కలబుర్గి జిల్లాలను ఎంపిక చేసిందని కార్యచరణ సిద్ధం చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

దివ్యాంగులకు సత్వర న్యాయ సేవలు అందాలి

● జిల్లా న్యాయాధికారి కేజీ శాంతి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి శాంతి

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలో అందరూ సమానమేనని, అనారోగ్యం, దివ్యాంగులకు సత్వర న్యాయ సేవలు అందించాలని జిల్లా న్యాయాధికారి కే.జి.శాంతి అన్నారు. గురువారం నగరంలోని తాలూర్‌రోడ్డులోని నూతన కోర్టు కాంప్లెక్స్ ఆడిటోనియంలో డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ,నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్త నిర్వహించిన 'పిల్లల స్నేహపూర్వక న్యాయసేవల పథకం కింద మానసిక అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు , మేధో వైకల్యం ఉన్న వ్యక్తుల కోసం న్యాయ సేవల పథకం 2025 అనే అంశంపై ఒక రోజు కార్యక్రమాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు. దివ్యాంగులు, మానసిక అనారోగ్యంతో ఉన్న పిల్లలు సమాజంలో గౌరవంగా జీవించే హక్కును కలిగి ఉన్నారు. అలాంటి పిల్లలకు సౌకర్యాలు కల్పించడానికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. బాల్యవివాహాలు, విద్యను కోల్పోయిన పిల్లలు, దివ్యాంగులైన పిల్లల సమస్యలను పరిష్కరించడం, స్పందించడం ప్రతి పౌరుడి విధి అన్నారు. అలాంటి పిల్లలను సరైన మార్గంతో చూసుకోవడం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం తల్లిదండ్రుల ప్రాథమిక బాధ్యత అన్నారు. రాష్ట్రంలో 14,9శాతం మంది పురుషులు, 11.8శాతం మంది మహిళలు వైకల్యంతో బాధపడుతున్నారని, జిల్లాలో 2.41శాతం మంది పురుషుల/, 2.01 శాతం మంది మహిళలు ,0.80శాతం మంది పిల్లలు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె మాట్లాడుతూ.. రాజ్యాంగంలో పిల్లలు మానసిక అనారోగ్యం,మొదో వైకల్యాలున్న వ్యక్తుల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. న్యాయసేవలను సరైన రీతిలో ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా సెషన్స్ న్యాయాధికారి హడగలిరాము, తిప్పేస్వామి న్యాయవాదులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరుడి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తాలుకాలోని పరమదేవనహళ్లి గ్రామంలో ఏడవ సంవత్సరం రామలింగేశ్వర మహారథోత్సవాన్ని గురువారం అంగరంగ వైభవంగా కన్నుల పండువగా నిర్వహించుకున్నారు. రథోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చారు. రామలింగేశ్వర దేవస్థానం నుంచి ఎదురు బసవన్న దేవస్థానం వరకు భక్తుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా రథం లాగారు. ఈ రథోత్సవానికి పరమదేవనహళ్లి ఎస్ఐ నాగభూషణం, క్రైమ్ సబ్ ఇన్స్‌పెక్టర్ పరమేశప్ప, పోలీసు సిబ్బంది ప్రభాకర్ రెడ్డి, ధారాసింగ్, రవి, సిద్ధప్ప బందోబస్తు నిర్వహించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



కళాకారులతో ధర్మకర్త డాక్టర్ ప్రసాద్

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఎస్ఎన్‌పేట విరూపాక్షేశ్వర ఆలయంలో బుధవారం రాత్రి శివతాండవ నృత్యరూపక ప్రదర్శన భక్తులను తన్మయిపరిచింది. తుంగా-గంగా కళాట్రస్టు కళాకారులు డా.వీణా, వైష్ణవి, అనన్య, హరిణి,వేద, అతిథి, హారిక శివకల్యాణం నృత్యరూపకం పదర్శించారు. కళాకారులందరికి ఆలయ ధర్మకర్త డా.ప్రసాద్ జ్ఞాపికలు అందజేసి అభినందించారు, కార్యక్రమంలో వేదపండితులు గోపిశర్మ, న్యాయవాది శ్వేత, నాగభూషణం ,భక్తులు పాల్గొన్నారు.

భువనేశ్వరీ మాతకు ఘన స్వాగతం

హోస్పేట(విజయనగరం), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): హంపి ఉత్సవాలకు భువనేశ్వరీ మాతను ఘనంగా ఆహ్వానించారు. ఉత్సవాల కోసం హోస్పేట నగరాన్ని కలిపే ప్రధాన రహదారులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. వీధుల్లోని విద్యుద్దీపాలు హంపి ఉత్సవానికి అందరినీ స్వాగతిస్తాయి. హంపి ఉత్సవంలో భాగంగా గురువారం హోస్పేట నగరంలో నిర్వహించిన వసంత వైభవ కళా బృందం కవాతు దేశ సాంస్కృతిక వైవిధ్యానికి నిదర్శనంగా నిలిచింది. దేశంలోని వివిధ ప్రాంతాలు, పొరుగు రాష్ట్రాల నుంచి 125 కళా బృందాల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భువనేశ్వరిని అంబారీపై తీసుకురావడం ఇదే తొలిసారి. విజయనగర ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప హోస్పేట నగరంలోని వడకారాయణ ఆలయ సమీపంలో వసంత వైభవ ఊరేగింపును జెండాఊపి ప్రారంభించారు. జిల్లా కమిషనర్ ఎంఎస్ దివాకర్, జిల్లా పంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నోంగ్‌జోయ్ మహమ్మద్ అలీ అక్రమ్ షా అదనపు జిల్లా కమీషనర్ బాలకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ వివేక్, తహసీల్దార్ శృతి మల్లప్పగౌడ, కన్నడ, సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సిద్దలింగర గన్నవర ప్రజలు ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు.

గజరాజుకు ప్రజల స్వాగతం..





గజరాజు ఆశీస్సులు పొందుతున్న ఎమ్మెల్యే గవియప్ప

సిద్ధమైన వేదికలు

కంప్లి, (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు దక్షిణ కాశీగా పేరుపొందిన హంపి ఉత్సవాలకు వేదికలు సిద్ధమయ్యాయి. వేదికలతో పాటు ముఖద్వారాలు, బైస్కై కోసం కమలాపురంలో మయూర హోటల్ భవనం వద్ద హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. ఇప్పటికే ప్రధాన రోడ్లలో లైట్లతోను ముఖద్వారాలను ముస్తాబు చేపట్టి అందంగా తీర్చిదిద్దారు. జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ హోస్పేట పట్టణంలో కార్మికులకు వీఐపీ పాసులు పంపిణీ చేశారు.



ఆకట్టుకుంటున్న స్వాగత తోరణం

మినీ బస్టాండు నిర్మాణానికి స్థల పరిశీలన

కంప్లి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాతబస్టాండు వద్ద గల స్థలాన్ని పురసభ అధ్యక్షుడు బట్టా ప్రసాద్, ముఖ్య అధికారి దుర్గన్న, బళ్లారి జిల్లా కేఎస్ఆర్టీసీ అధికారి భగవత్ చామరాజు, స్థాయి సమితి అధ్యక్షులు ఉస్మాన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బట్టా ప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ సర్కిల్‌లో గంగావతి, హోస్పేట, పాత బస్టాండు వద్ద కురుగోడు, బళ్లారి నాలుగు వైపులా వెళ్లేందుకు ప్రయాణికులకు సరియైన బస్టాండు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనికి పరిష్కారంగా మినీ బస్టాండు నిర్మించాలని ప్రయత్నిస్తు న్నామన్నారు. గాలి, వర్షం ఎడలు ఇతర ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వుంటాయని తెలిపారు. అందరికీ అనుకూలంగా ఈ ప్రాంతం ఉంటుందని ఆయన అన్నారు. వారితో పాటు సుధాకర్, ప్రసాద్, శ్రీనివాస్, రాఘవ, జేఈ మేఘన, కిషోర్, పట్టణ వాసులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న పురసభ అధ్యక్షుడు బట్టాప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీసీ మహమ్మద్ జుబేర్

గిరిజన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

● జిల్లా అదనపు కలెక్టర్ మహ్మద్ జుబేర్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మార్చి 8న జిల్లాలో జరగనున్న గిరిజన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేయాలని అదనపు జిల్లాకలెక్టర్ మహమ్మద్‌జుబేర్ అధికారులకు సూచించారు. నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన గిరిజన ఉత్సవ కార్యక్రమ సన్నాహక సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఉత్సవ కార్యక్రమాన్ని మార్చి 8న ఉదయం నగరంలోని మున్సిపల్ కళాశాల మైదానంలో నిర్వహిస్తామన్నారు. వేడుకల ఆహ్వాన పత్రాలను నియమాల ప్రకారం ముద్రించి ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు పంపిణీ చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జరుపుకోవడానికి వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీరు, ఆహారం, సిట్టింగ్ ఏర్పాట్లు సక్రమంగా చేయాలని మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్‌ను ఆదేశించారు. గిరిజన పండుగను వ్యవస్థీకృతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని, దీనికి అవసరమైన సన్నాహాలు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. పాఠశాల విద్య శాఖ, సాంఘిక సంక్షేమం,మహిళా శిశుసంక్షేమ అధికారులు పాఠశాల పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ కళారూపాలు, చిత్రలేఖనం,శిల్పకళ ప్రదర్శనలు, హస్తకళల ప్రదర్శనలు,స్థానిక ఇతర జిల్లాల కళాకారులచే అమ్మకాలు, గిరిజన దుస్తులు, అభరణాల ప్రదర్శనలు ,ఆహార ప్రదర్శనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సాంయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్విహించాలని కన్నడ సాంస్కృతిక శాఖ అధికారిని ఆదేశించారు. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు, షెడ్యూల్డ్‌కులాల సంక్షేమ అధికారి దివాకర్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున, విజయ్‌కుమార్, పాఠశాల విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఉమాదేవి, మహానగర పాలికె కార్పోరేషన్ కమిషనర్, వివిధ జిల్లా స్థాయి శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కన్నడ భాష పరిరక్షణకు చేతులు కలపాలి

● కసాప జిల్లా అధ్యక్షుడు నిష్ఠిరుద్రప్ప



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కల్యాణ స్వామీజీ

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కన్నడ భాషకు నాలుగు నుంచి ఐదు వేల సంవత్సరాల చరిత్ర ఉన్నప్పటికీ ఇటీవల మన రాష్ట్రంలో అది నిర్లక్ష్యం చేయబడుతోందని, కన్నడ పరిరక్షణకు అందరూ చేతులు కలపాలని కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు నిష్ఠిరుద్రప్ప పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి తేరువీదిలో శివరాత్రిలో భాగంగా కర్ణాటక యువ శక్తి సంఘటన నిర్వహించిన మహారాత్రి వినోద కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 67 సంవత్సరాల తర్వాత బళ్లారి జిల్లాలో అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం జరగడం కన్నడిగులందరికీ సంతోషకరమైన విషయమన్నారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయడానికి అందరమూ కలిసి రావాలన్నారు. కమ్మరచేడు మఠానికి చెందిన కల్యాణ స్వామి మహాశివరాత్రి ఉపవాసంతో ఆరోగ్యంతో పాటు, పరమశివుడి సంపూర్ణ ఆశీర్వాదాలు అందుతాయన్నారు. నవ కర్ణాటక యువ శక్తి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింబల్ మంజునాథ్, ఆఫీస్ బేరర్లు, భక్తులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికే 'కలిక' కార్యక్రమం



కలికాబలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సిరుగుప్ప, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చక్కగా చదవడం, రాయడం కోసం అత్యవసరంగా 'కలిక' కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని డీఆర్పీ కోఆర్డినేటర్ శాంతమ్మ అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం తాలుకాలోని కొత్త దేవలాపురంలో విద్యాశాఖ, తాలుకా పంచాయతీ, జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన కలికాబ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు రాయడం, చదవడం అక్షరాభ్యాసం, సాంస్కృతిక, సంగీత పోటీల్లో పాల్గొనే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందినవారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమానాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డీఎంసీ అధ్యక్షులు సర్దారప్ప, ముఖ్య ఉపాధ్యాయులు పద్మావతి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయునీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ యూనిట్ ప్రారంభించాలి

● ఆంద్రాల్ సేవాసమితి డిమాండ్



సర్జన్ బసారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఆంద్రాల్ సభ్యులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లాసుపత్రిలో ఎమర్జెన్సీ సేవల యూనిట్, క్యాన్సర్‌యూనిట్, డేకేర్ సెంటర్‌ను ప్రాంరభించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆంద్రాల్ సేవాసమితి జిల్లాఆసుపత్రి సర్జన్ డాక్టర్ బసారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా సమితి ప్రముఖులైన వెంకటరెడ్డి, అల్లీపురం శ్రీనివాస్‌రెడ్డి,రాణితోట విరూపాక్షి,రాజ,మోహన్‌రెడ్డి, సురేశ్ మాట్లాడుతూ ఎమర్జెన్సీ యూనిట్ జిల్లా ఆసుపత్రిలో కూడా ఉంటే ప్రజలకు అనుకూలంగా ఉంటుందన్నారు. స్పందించిన సర్జన్ బసారెడ్డి నిధుల మంజూరు కోసం సంబంధించిన శాఖల వారితో చర్చించి ఎమర్జెన్సీ ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు.

ఘనంగా మహాశివరాత్రి

సిరుగుప్ప, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఘనంగా మహాశివరాత్రి జాగరణ వేడుకలు జరిగాయి. సిరుగుప్ప తాలుకాలోని మహాశివరాత్రి జాగరణను పురస్కరించుకుని రాత్రివేళల్లో మేల్కొని స్వాముల వారికి పూజలు చేశారు. ప్రధానంగా సిరుగుప్ప పట్టణం అమృతేశ్వరాలయంలో భక్తులు దర్శనం కోసం పోటెత్తారు. గంటల తరబడి స్వామివారి దర్శనాన్ని పొందారు. పరమశివుని భక్తి పారవశ్యంతో భక్తిగీతాల సంగీత విభావరి అమృతేశ్వరాలయం, పేటే ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణంలో జరిగింది. నాగలింగేశ్వరాలయం వద్ద రాత్రి అఖండ భజనలు నిర్వహించారు. మధ్యరాత్రి సమయంలో ప్రసాద పంపిణీ ఆలయ కమిటీ సభ్యులు చేశారు.

హోసూరు జోన్

అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి) ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను కలెక్టర్ దినేశ్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణగిరి జిల్లా హోసూరు సర్కిల్ పరిధిల్లోని హోసూరు బస్టాండు , ముఖ్యమంత్రి అల్పాహార తయారీ గృహం, కారపల్లి, ఏఎస్టీసీ హడ్కో ఆవలపల్లి 7 వ వార్డులో మీ ఊరిలో మీకోసం కార్యక్రమం చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. అనంతరం ఆయన బస్టాండ్‌లో పనులను పరిశీలించారు. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 35 వ వార్డు పాఠశాలలో చదువుతున్న 6,352 మది విద్యార్థులకు ముఖ్యమంత్రి అల్పాహార కార్యక్రమం కింద అల్పాహారం అందించేందుకు తయారు చేసిన ఆహారాన్ని సేవించి నాణ్యత పరిశీలించారు. తదనంతరం ఏఎస్‌హడ్కో ప్రాంతంలో ఘన వ్యర్థాల నిర్వాహణ కార్యక్రమం క్రింద, చెత్త సార్టింగ్ మరియు మైక్రోబయల్ కంపోస్ట్ ప్రాసెసింగ్ సెంటర్‌ను స్వయంగా సందర్శించి పరిశీలించారు. అలాగే హోసూరు సర్కిల్ ఆవలపల్లి 7 వ వార్డులో జరుగుతున్న భూగర్భ మురుగు కాల్వల ప్రాజెక్టు పనులను కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ వార్డులో ఇంటింటికి చెత్త సేకరణను కూడా ఎలా సేకరిస్తారని ఆయన వార్డులో పరిశీలించారు. హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ బత్తలపల్లి లో రూ.32.95 కోట్లతో నూతనంగా నిర్మించిన బస్టాండ్ నిర్మాణ పనులను, హోసూరు రాయకోట రోడ్డులో రూ.100 కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ తనిఖీల్లో హోసూరు సబ్ కలెక్టర్ ప్రియంక, హోసూరు మున్సిపల్ కమీషనర్ పూంగోడీ, తాగు నీరు, డ్రైనేజీ బోర్డు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రవికుమార్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ చిన్నస్వామి, జిల్లా అభివృద్ధి అధికారి కుమరేశన్ తదితర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



హోసూరు బస్టాండులో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్ కుమార్

మల్బరీ సాగుపై రైతులకు అవగాహన

హోసూరు ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా శూలగిరి రాష్ట్ర విస్తరణ పథకాల ఆసరా పథకం క్రింద చిన్నరందొడ్డి గ్రామంలో మల్బరీ సాగులో మెలకువలపై రైతులకు గురువారం ఒకరోజు శిక్షణ నిర్వహించారు. శిక్షణల్లో వ్యవసాయ సహాయ సంచాలకులు పన్నీర్‌సెల్వం, పట్టు అభివృద్ధి శాఖ జూనియర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణేగౌడు, పట్టు అభివృద్ధి శాఖ జూనియర్ ఇన్‌స్పెక్టర్లు లోఖమూర్తి, అసిస్టెంట్ హార్టికల్చర్ అధికారి తిరుమురుగన్ , స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.వ్యవసాయ సహాయ సంచాలకులు మాట్లాడుతూ.. సెరికల్చర్‌కు మల్బరీ ఆకులు మూలం, ఈ గొంగళి పురుగులు మల్బరీ ఆకులు తప్ప ఇతర ఆకులను ఆహారం స్వీకరించవు అని తెలిపిన రైతులు అందువల్ల మల్బరీ ఆకుల ఉత్పత్తి తర్వాత మాత్రమే పట్టు పురుగుల పెంపకం చేపట్టవచ్చు, మల్బరీ మొక్క ఏడాది పొడవునా పెరుగుతుంది, ఉపయోగకరంగా ఉండదు, ఇది ఎక్కువగా శాశ్వత పంటగా సాగు చేయబడినప్పటికీ, వర్షపు నీటితోనే తోటలు కూడా నిర్వహించబడుతున్నాయి. ఈ ప్రాంతంల్లో మల్బరీ సాగు చేపట్టాలని అధికారులు తెలిపారు. తమిళనాడులోని ఈరోడ్డు, కోయంబత్తూరు, ధర్మపురి, సేలం, మధురై,కృష్ణగిరి, వేలూరు, జిల్లాలో మల్బరీని సాగు చేస్తారు. మల్బరీ సాగులో హెక్టర్లకు సంవత్సరానికి 35-40 టన్నుల ఆకు దిగుబడిని ఇవ్వవు, వర్షాదార సాగు కోసం అనువైన ఆకు అని తెలిపారు. సరైన ప్రణాళికతో సాగు చేస్తే ఉత్తమ రాబడి, లాభాలు సాధించవచ్చని తెలిపారు. ఈ శిక్షణకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా టెక్నికల్ మేనేజర్ ప్రియ, అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్లు మహమ్మద్ రఫీ, పళనిస్వామి తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

బాబూ రాజేంద్రప్రసాద్ (వర్ధంతి)



దేశ తొలి రాష్ట్రపతిగా వ్యవహరించిన డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ 1884 డిసెంబరు 3న బీహార్ రాష్ట్రం శివాన్ జిల్లా జెర్దాయ్ గ్రామంలో జన్మించారు. 1950 నుంచి 1962 వరకు రాష్ట్రపతిగా కొనసాగారు. ఉపాధ్యాయుడిగా, న్యాయవాదిగా వ్యవహరించారు. స్వాతంత్ర్య సంగ్రామంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. రాష్ట్రపతి హోదాలో దేశ రాయబారిగా విదేశాలతో దౌత్యసంబంధాలు మెరుగ్గా ఉండేలా పలు చర్యలు చేపట్టి ఇతరులకు మార్గదర్శకంగా నిలిచారు. పార్లమెంటులో ఆయన చేపట్టిన సంస్కరణలు నేటికీ కొనసాగుతున్నాయి. ఆయన సేవలకు అత్యున్నత ఎభారతరత్న్ పురస్కారం అందుకున్నారు. 1963 ఫిబ్రవరి 28న కన్నుమూశారు.

రాచమల్లు రామచంద్రారెడ్డి (జయంతి)



'రారా'గా పేరొందిన రాచమల్లు రామచంద్రారెడ్డి 1922 ఫిబ్రవరి 28న కడప జిల్లా సింహాద్రిపురం మండలం సైడిపాలెం గ్రామంలో జన్మించారు. తెలుగు సాహిత్యానికి తన విమర్శతో, అనువాదాలతో, పాత్రికేయ రచనలతో వన్నె తెచ్చి బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణించారు. 'అనువాద సమస్యలు' అనే గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. మరో గ్రంథం 'సారస్వత వివేచన'కు రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. ఎన్నో గ్రంథాలను అనువదించి అనువాదకులుగా కూడా రాణించారు. 1988 నవంబరు 25న కన్నుమూశారు.

అబ్దుల్ సత్తార్ ఈది (జయంతి)



అబ్దుల్ సత్తార్ ఈది 1928 ఫిబ్రవరి 28న గుజరాత్ రాష్ట్రం బంత్వా గ్రామంలో జన్మించారు. పక్షవాతానికి గురైన తల్లికి అందించిన సేవలను దృష్టిలో ఉంచుకుని ముసలివాళ్లకు, మానసిక దివ్యాంగులకు, దివ్యాంగులకు సేవ చేసే లక్ష్యంతో ముందుకు సాగారు. 1947లో పాకిస్థాన్‌కు వలస వెళ్లారు. కరాచీలో పేద ప్రజలకోసం ఒక ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఉచిత వైద్యం, ఇతర సేవలు అందించారు. అనాథాశ్రయాలు, వైద్య కళాశాలలు, మహిళా వసతి గృహాలను నిర్వహిస్తోంది. ఆయన సేవలకు లెనిన్ శాంతి బహుమతి, రామన్ మెగసెసె అవార్డు ఇతర పురస్కారాలు అందాయి. 2016 జూలై 8న కన్నుమూశారు. ప్రస్తుతం ఈది ఫౌండేషన్‌ను ఆయన కుమారుడు ఫైజల్ పర్యవేక్షిస్తున్నారు.

మాండొలిన్ శ్రీనివాస్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత మాండొలిన్ శ్రీనివాస్ 1969 ఫిబ్రవరి 28న పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో జన్మించారు. అసలు పేరు ఉప్పలపు శ్రీనివాస్. మాండొలిన్ వాద్యం వాయించడంలో రాణించి మాండొలిన్ శ్రీనివాస్‌గా గుర్తింపు పొందారు. కర్ణాటక సంగీతంలో మాండొలిన్‌ను ఉపయోగించిన ప్రథమ కళాకారుడు. రాగాలు, స్వరాలకు అనుకూలంగా మాండొలిన్‌ను మలిచాడు. హిందూస్తానీ సంగీతంలోనూ రాణించారు. కెనడా, ఆస్ట్రేలియా తదితర దేశాలలో సంగీత కచేరీలు నిర్వహించారు. హరిప్రసాద్ చౌరాసియా, జాకీర్ హుస్సేన్ వంటివారితో కలసి పనిచేశారు. 15ఏళ్లకే తమిళనాడు రాష్ట్ర ఆస్థాన విద్వాంసుడిగా పదవి పొందగా, సంగీత రత్న, సనాతన సంగీత పురస్కార్ తదితర పురస్కారాలు అందుకున్నారు. 2014 సెప్టెంబరు 19న కన్నుమూశారు.

సునీల్ (పుట్టినరోజు)



సునీల్‌గా పేరొందిన ఇందుకూరి సునీల్‌వర్మ 1973 ఫిబ్రవరి 28న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జన్మించారు. తెలుగు నటుడిగా 200కుపైగా సినిమాలలో నటించారు. తొలుత హాస్య నటుడిగా నటించి తర్వాత కథానాయకుడిగా మారారు. నువ్వేకావాలి, నువ్వు నేను, నువ్వు నాకు నచ్చావ్, సొంతం, మనసంతా నువ్వే, ఆంధ్రుడు తదితర సినిమాలు హాస్య నటుడిగా గుర్తింపు తెచ్చాయి. అందాల రాముడు, మర్యాదరామన్న కథానాయకుడిగా పేరొందాయి. ఉత్తమ హాస్యనటుడిగా నంది పురస్కారం, స్పెషల్ జ్యూరీ పురస్కారం, ఫిలిమ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు.

దక్షిణాది జిల్లాలకు

భారీ వర్ష సూచన

అడయార్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలో దక్షిణాది జిల్లాల్లో భారీ వర్షాలు కురువనున్నట్లు భారత వాతావరణ చెన్నై ప్రాంతీయ కేంద్రం అధికారులు ప్రకటించారు. దీంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని 12 జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. సచివాలయంలో గురువారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్ వర్షాలు కురిసే అవకాశం ఉన్న జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు దురైమురుగన్, ఆర్.చక్రపాణి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం తదితరులు పాల్గొన్నారు. బంగాళాఖాతంలో తూర్పు దిశ గాలుల్లో మార్పు కారణంగా శుక్రవారం నుంచి మార్చి 3వ వరకు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండటంతో ఆయా జిల్లాల కలెక్టర్లు ముందస్తు చర్యలు చేపట్టాలని స్టాలిన్ ఆదేశించారు. ఇక వాతావరణ శాఖ చేసిన ప్రకటన ప్రకారం పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. అదే విధంగా శుక్రవారం నుంచి మార్చి ఒకటి వరకు తంజావూరు, పుదుక్కోట, రామనాథపురం, శివగంగై, విరుదునగర్, తేని, మదురై, దిండిగల్, తెన్‌కాశి, తూత్తుక్కుడి, తిరునెల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షం కురుస్తుందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నేపథ్యంలో కోయంబత్తూరు, నీలగిరి, తిరుపూర్, తేని, దిండిగల్, తెన్‌కాశి, తిరునెల్వేలి, కన్నియాకుమారితో సహా 22 జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. భారీ వర్ష సూచన నేపథ్యంలో ముందస్తు చర్యలతో పాటు ప్రజలకు అవసరమైన సహాయ సామగ్రిని సిద్ధం చేసివుంచుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.




జ్యోతి వెలిగించి పుస్తకమేళాను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

సాహిత్య సంబరాన్ని సద్వినియోగం చేసుకోండి

● విధానసౌధ పుస్తక మేళా ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకునేందుకు వీలుందని విధానసౌధలో ఏర్పాటు చేసిన పుస్తక మేళాను ఓ సాహిత్య సంబరాన్ని తలపిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని సీఎం సిద్దరామయ్య పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం విధానసౌధ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పుస్తకమేళా సదస్సుకు స్పీకర్ యూటీ ఖాదర్ అధ్యక్షత వహించగా పరిషత్ సభాపతి బసవరాజహొరట్టి, డీసీఎం డీకే శివకుమార్‌లు ముఖ్యులుగా పాల్గొన్నారు. ఇదే సందర్భంగా జ్ఞానపీఠ పురస్కార గ్రహీత చంద్రశేఖర కంబార, గోవా రాష్ట్ర సీనియర్ సాహితీవేత్త జ్ఞానపీఠ పురస్కార గ్రహీత దామోదర్ మౌజోలను ప్రత్యేకంగా సత్కరించారు. సీఎం మాట్లాడుతూ సాహిత్యం చదవడం ద్వారా మనిషి మానవత్వం విలువలను తెలుసుకుంటారన్నారు. ప్రతి ఇంటిని గ్రంథాలయంగా మార్చుకోవాలన్నారు. స్పీకర్ యూటీ ఖాదర్ మాట్లాడుతూ విధానసౌధ ప్రాంగణంలో తొలిసారి ఏర్పాటు చేసిన పుస్తక మేళాకు అనూహ్యమైన స్పందన వచ్చిందన్నారు. వందలాది పబ్లిషర్స్ సంస్థలు భాగస్వామ్యులు కావడం సంతోషకరమన్నారు. ఆధునిక కాలంలో పిల్లలు సైతం మొబైళ్లు పక్కన పెట్టి పుస్తకాలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు.



ఆసక్తిగా పుస్తకాన్ని చదువుతూ..



ఘనంగా కాశీ విశ్వనాథుడి రథోత్సవం

చేళూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన చేళూరులో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం పురాతన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం ఘనంగా జరిగింది. బుధవారం రాత్రి విశేషపూజలు, యామపూజలు కొనసాగాయి. జాగరణలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. చింతామణి మార్గంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఆలయం వద్ద గురువారం సందడి నెలకొంది. కేఎస్ రామకృష్ణారెడ్డి, మనోహర్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

యానిమేషన్‌కు బంగారు భవిష్యత్తు

● రాష్ట్ర ఐటీ బీటీ శాఖ మంత్రి ప్రియాంకఖర్గే

బెంగళూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): విశ్వవ్యాప్తంగా డిజిటల్ రంగం అన్ని విభాగాలలోను దూసుకుపోతోందని యానిమేషన్‌కు మంచి భవిష్యత్తు ఉందని రాష్ట్ర ఐటీ బీటీ శాఖా మంత్రి ప్రియాంకఖర్గే అభిప్రాయపడ్డారు. జీఏఎఫ్ఎక్స్ 2025 సదస్సు గురువారం లాంచనంగా ఆరంభించారు. కేంద్ర ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శి సంజయ్‌జాజు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. బయోకాన్ సీఎండీఈ కిరణ్‌మజుందార్‌షా, ఎమ్మెల్యే రిజ్వాన్‌అర్షద్, కియోనెక్స్ ఛైర్మన్ శరత్ బచ్చేగౌడ, బెంగళూరు కాన్సుల్ జనరల్ ఆఫ్ ఫ్రాన్స్ మార్క్‌లమీ, కాన్సుల్ ఆఫ్ ఇటలీ ఆల్ఫోన్సో టగ్గియపరి, కాన్సుల్ ఆఫ్ ఆస్ట్రేలియా హిలరీ మ్యాక్‌గియచిలతో పాటు వివిధ గేమింగ్, యానిమేషన్ కంపెనీల సీఈఓలు పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా తెలుగునటుడు దగ్గుబాటి రానా హాజరయ్యారు.



జీఏఎఫ్ఎక్స్ సదస్సు ప్రారంభంలో మంత్రి ప్రియాంకఖర్గే, సంస్థ ప్రతినిధులు

అన్నదాత జీవితాల్లో మార్పు కోసమే ప్రత్యేక పథకాలు

● కేంద్ర మంత్రి శోభాకరంద్లాజే

బెంగళూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అన్నదాత జీవనోపాధిలో మార్పు తీసుకు వచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమాలను అమలు చేస్తోందని కేంద్ర మంత్రి శోభాకరంద్లాజే పేర్కొన్నారు. గురువారం హెసరఘట్ట జాతీయ ఉద్యాన పరిశోధనా కేంద్రం ప్రాంగణంలో జాతీయ ఉద్యాన మేళాను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఇటీవల ఉద్యానపంటల సాగుకు ప్రాధ్యానత ఇస్తున్నారన్నారు. ప్రతి రైతు భద్రతకు సమగ్ర వ్యవసాయ విధానంతో పాటు గిట్టుబాటు ధరలు కీలకమన్నారు. హరిత విప్లవం ద్వారా దేశంలో ఆహారభద్రత సాధించగలిగామన్నారు. 2047నాటికి ప్రపంచానికి అవసరమయ్యే ఆహార వస్తువులు సమకూర్చే ఖజానాగా భారత్ రాణిస్తుందన్నారు. ఆదిశగా రైతులు సాంకేతిక విధానాలు, ఉత్తమ దిగుబడుల వంగడాలను ఎంపిక చేసుకోవాలన్నారు. నీతి ఆయోగ్ సభ్యుడు ప్రొఫెసర్ రామేష్‌చంద్, ఎమ్మెల్యే సురేష్‌బాబు, గాంధీకృషి విజ్ఞానకేంద్ర వీసీ డాక్టర్ ఎస్‌వి సురేష, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ ఛైర్మన్ ఎంకె నాయక్, ఐసీఏఆర్ హార్టికల్చర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వివి పటేల్ తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ రైతులను ఇదే సందర్భంగా సత్కరించారు.



ఉద్యానమేళాను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి శోభాకరంద్లాజే

ఉత్సాహంగా శివరాత్రి సంబరాలు



భద్రకాళి వేషంలో నృత్యం చేస్తున్న పూజారి కమల్

బంగారపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి అంటే ఎంతో నిష్టగా ఉపవాసం ఉండి ఆచరణ చేస్తారు. కాగా సరిహద్దు ప్రాంతమైన బంగారపేటలో తమిళనాడు సంప్రదాయం తరహాలో సంబరం సాగుతుంది. మహాశివరాత్రి రోజును యధావిధిగా పూజలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మరుసటి రోజు అమావాస్య రోజున స్మశానవాసి అయిన శివుడిని విభిన్నంగా పూజించి, కాళిమాత వేషధారిగా నరకాసురుడిని సంహరించి బలి ఇస్తారు. ఇలా చేయడం ద్వారా దుష్టశక్తులు నశిస్తాయని భక్తుల విశ్వాసంగా ఉంది. గురువారం తాళానికి తగినట్టు నృత్యం చేస్తున్న కాళిమాత వేషధారి మంగళముఖి చూపరులను గగుర్పాటుకు గురిచేసింది. ఒకవైపు గొర్రె, మేకను నోటిలో పెట్టుకుని రక్తం తాగుతున్న దృశ్యం భయానంగా అనిపించగా మరోవైపు సమాధిపై నిలబడి బీరు తాగడం, గుప్పుమంటూ బీడీ పొగలు వదలడాన్ని ఆసక్తిగాఖ వీక్షించారు. బంగారపేట పట్టణంలోని కుంబారపాళ్యలో తమిళసంస్కృతి తరహాలో కొన్నేళ్లుగా కొనసాగుతోంది. నరకాసుర సంహార సన్నివేశాన్ని వీక్షించేందుకు సరిహద్దులోని ఆంధ్ర, తమిళనాడు ప్రాంత వాసులు తరలివచ్చారు. మొత్తమ్మీద దుష్టశక్తుల నివారణకు కరావళి ప్రాంతంలో భూతారాధన పేరిట కొనసాగిస్తుండగా బయలుసీమ లో కాళీదేవి ఆరాధకులు నరకాసురుడిని సంహరించే విధానం పాటిస్తున్నారు.

ఇకపై అన్ని కోర్టు నోటీసులు మెయిల్ ద్వారానే..

● హైకోర్టు ధర్మాసనానికి విన్నవించిన ప్రభుత్వం

బెంగళూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇకపై అన్ని కోర్టులకు సంబంధించిన సమన్లు, నోటీసులను మెయిల్ ద్వారానే జారీ చేసేందుకు వీలుగా నిబంధనలు సవరించామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ధర్మాసనానికి వివరించింది. న్యాయవాది అనిరుద్ సురేష్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి ఆర్ దేవదాస్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనంకు ప్రభుత్వం వివరించింది. కోర్టు నోటీసులు మెయిల్ ద్వారా పంపే అంశానికి సంబంధించి సవరించాల్సిన నిబంధనలను ఫిబ్రవరి 25లోగా కోర్టుకు సమాచారం గత వాయిదా వేళ న్యాయమూర్తి సూచించారు. అందుకు అనుగుణంగానే గురువారం ప్రభుత్వం తరుపున న్యాయవాది ప్రభుత్వ చర్యలను వివరించారు. ఈనెల 17వ తేదీనే రాష్ట్ర ప్రభుత్వం కోర్టుల నుంచి అన్ని నోటీసులు, సమన్లను మెయిల్ ద్వారా పంపే సవ రణల బిల్లును ఆమోదించిందన్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసిందన్నారు. తద్వారా మెయిల్ ద్వారా కోర్టు నోటీసులు, సమన్లు జారీ చేసే అత్యవసర బిల్లు తీసుకువచ్చినట్లు అయ్యింది.

మాజీ సీఎం యడియూరప్పకు 83 ఏళ్లు

● కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య జన్మదిన వేడుకలు

బెంగళూరు, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాలలో సీనియర్‌నేత మాజీ సీఎం యడియూరప్ప 83వ ఏట అడుగు పెట్టారు. గురువారం బెంగళూరు డాలర్స్ కాలనీలోని ఇంట్లో కుటుంబ సభ్యుల మధ్యన నిరాడంబరంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. పెద్దకుమారుడు శివమొగ్గ ఎంపీ బీవై రాఘవేంద్ర, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే విజయేంద్రలతో పాటు పలువురు కలిసి కేక్ కట్ చేయించారు. ఇద్దరు కుమారులు, కోడళ్ళు యడియూరప్పకు కేక్ తినిపించారు. పలువురు బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల కొంతకాలంగా యడియూరప్ప క్రియాశీలక రాజకీయాలలో లేకున్నా బీజేపీ కార్యక్రమాలలో పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న విషయం తెలిసిందే. పలువురు కేంద్రమంత్రులతో పాటు రాష్ట్ర మంత్రులు, పార్టీల కతీతంగా ముఖ్యనాయకులంతా యడియూరప్పకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న యడియూరప్ప

చంద్రశేఖర్ ఆజాద్ త్యాగం.. చిరస్మరణీయం

● ఏఐడీఎస్ఓ జిల్లా అధ్యక్షుడు మహేశ్ చీకలపర్వి

రాయచూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : దేశమాతా విముక్తి కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడిన చంద్రశేఖర్ ఆజాద్ త్యాగం చిరస్మరణీయమని ఏఐడీఎస్ఓ జిల్లాధ్యక్షుడు మహేశ్ చీకలపర్వి కీర్తించారు. యూనియన్ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని గురువారం నగరంలోఒని మామిడి చెరువు గార్డన్ వద్ద ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలువురు మార్నింగ్ వాకర్స్ కార్యక్రమంలో పాల్గొని చంద్రశేఖర్ ఆజాద్ జీవిత చరిత్ర గురించి వివరించారు. అనంతరం చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. దివంగత నాయకుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన విద్యార్థులు చంద్రశేఖర్ ఆజాద్ చూపిన మార్గం ఆదర్శప్రాయమన్నారు.



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఏఐడీఎస్ఓ నాయకులు